క్లుప్తంగా

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి



గర్భిణులకు సీమంతం చేస్తున్న సీడీపీవో పద్మావతి తదితరులు

రాయికల్: గర్భిణులు పోషకాహారం తీసుకున్నప్పుడే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా జన్మిస్తారని ఐసీడీఎస్ సీడీపీవో పద్మావతి అన్నారు. శుక్రవారం మండలంలోని బోర్నపల్లి గ్రామంలో పోషణ్ అభియాన్ పథకంలో భాగంగా గర్భిణులకు సీమంతం, మూడేళ్ల చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. అనంతరం పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భార్య చనిపోయిన భర్తలకు పెన్షన్ ఇవ్వాలి



రాంరెడ్డి

రాయికల్: భార్య చనిపోయి కొడుకుల ఆలనాపాలన లేక ఒంటరిగా జీవిస్తున్న వారికి చేయూత పథకం ద్వారా పెన్షన్ మంజూరు చేయాలని మండలంలోని ఆలూరు మాజీ సర్పంచ్ మెక్కొండ రాంరెడ్డి కోరారు. భర్త చనిపోయి వితంతువుగా మారిన భార్యకు ఎలా చేయూత అందిస్తున్నారో అదే రీతిలో భార్య చనిపోయిన భర్తకు కూడా పెన్షన్ మంజూరు చేయాలన్నారు. గ్రామాల్లో ప్రత్యేక సర్వే చేసి న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

‘ఉన్నతి’ పరిశీలన



బోధన తీరును పరిశీలిస్తున్న మహేశ్

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు గత సెప్టెంబర్ నుంచి నిర్వహిస్తున్న ఉన్నతి కార్యక్రమం అమలు తీరును జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి మహేశ్ శుక్రవారం పరిశీలించారు. ఈ మేరకు ఉపాధ్యాయులు తరగతి గదిలో ఏ విధంగా బోధిస్తున్నారో పరిశీలించి అట్టి వివరాలు నమోదు చేశారు. ఉపాధ్యయుల డైరీలో పాఠ్య ప్రణాళికలు పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఇమాన్యుయేల్, శివకృష్ణ, ఇబ్రహీం, మమత పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక



సామాజిక తనిఖీలో అధికారులు

మల్యాల: మండల కేంద్రంలోని ఎపీడీవో కార్యాలయం సమీపంలో శుక్రవారం ఉపాధి పథకంసామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. డీఆర్‌డీవో పీడీ నరేశ్, రాష్ట్ర రిసోర్స్ పర్సన్ తి రుపతి, ఎంపీడీవో వెంకటేశం ఆధ్వర్యంలో పనుల వివరాలు, ఫీల్డ్ అసిస్టెంట్ల పనితీరుపై తనిఖీ బృంద సభ్యులు వివరించారు. వివిధ గ్రామాల్లో రూ.47,642 విలువైన పనులు తప్పుగా నమోదు చేయబడినట్లు గుర్తించి, సంబంధిత ఫీ ల్డ్ అసిస్టెంట్, కార్యదర్శి, టెక్నికల్ అసిస్టెంట్ల నుంచి రికవరీ చేయాలని అధికారులు ఆదేశించారు. విజిలెన్స్ అధికారి చిన్నయ్య, క్వాలిటీ కంట్రోలర్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థి ప్రతిభ



అభినందిస్తున్న ఉమాకాంత్

జగిత్యాల: జగిత్యాలలో జరిగిన కరాటే స్టేట్ లెవల్ చాంపియన్‌షిప్ పోటీల్లో రూట్స్ ఫౌండేషన్ స్కూల్‌కు చెందిన విద్యార్థి ఆకుల రుతిక్ సత్తాచాటి బంగారు, వెండి పతకాలు సాధించాడు. ఈ సందర్భంగా రుతిక్‌ను రూట్స్ ఫౌండేషన్ కరస్పాండెంట్ జిల్లా ఉమాకాంత్ అభినందించారు. ఇలాంటి పతకాలు ఇంకెన్నో సాధించాలని ఆకాంక్షించారు.

31న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

జగిత్యాలటౌన్: ఈనెల 31న ఆదివారం ఉదయం 11గంటలకు జిల్లాస్థాయి జూనియర్ బాలబాలికల కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అమెచ్యూర్ కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుర్ర సుదర్శన్‌రెడ్డి, రఘుపతినాయక్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని వివేకానంద మినీ స్టేడియంలో నిర్వహించే పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు జనవరి 11 నుంచి 14వరకు సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఫిబ్రవరి 2004 తర్వాత జన్మించినవారై ఉండాలని, వివరాలకు 89783 78306, 80085 43317 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గంగనాల.. నిండేదెలా?

- ఆయకట్టు సాగునీటికోసం రైతుల తిప్పలు
- ప్రాజెక్టులోకి చుక్క నీరు రాని వైనం
- నీటిని మళ్లించేందుకు అన్నదాతల యత్నం
- పట్టించుకోని నీటిపారుదల శాఖ అధికారులు



శిథిలావస్థలకు చేరిన గంగనాల ప్రాజెక్టు గేట్లు



వేములకుర్తి శివారు గోదావరి నుంచి ప్రాజెక్టుకు నీటిని మళ్లించేందుకు రాళ్లతో అడ్డుకట్ట వేస్తున్న రైతులు

ఇబ్రహీంపట్నం: వానాకాలంలో వర్షాలు సమృద్ధిగా కురియడంతో గంగనాల ప్రాజెక్టుకు జలకళ సంతరించుకుంది. దీంతో ఆయకట్టు రైతులు వందలాది ఎకరాల్లో పంటలు పండించారు. కానీ ఈ యాసంగిలో ప్రాజెక్టులోకి నీళ్లు రాకపోవడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. 1959లో ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి శివారులో అప్పటి భారీ నీటిపారుదలశాఖ మంత్రి నర్సింగారావు గంగనాల ప్రాజెక్టును నిర్మించారు. దీని ద్వారా ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి, యామాపూర్, ఫకీర్‌కొండాపూర్ గ్రామాలతోపాటు, మల్లాపూర్ మండలం మొగిలిపేట పెద్ద చెరువులోకి నీరు చేరి చుట్టు క్కల గ్రామాల్లో 2,500 హెక్టార్లకు సాగునీరు అందించారు.

వైఎస్సార్ హయాంలో..

స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ ప్రాజెక్టు నుంచి మాటు కాలువ వెడల్పు చేసి ఇరువైపులా సిమెంట్ లైనింగ్ చేపట్టి 4,500 ఎకరాలకు సాగు నీరు అందించేందుకు రూ.20 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో గంగనాల మాటు కాలువ 20 కిలోమీటర్ల వెడల్పు, సిమెంట్ లైనింగ్ పూర్తి చేసుకుని ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాల్లోని కొన్ని గ్రామాలకు సాగు నీరు అందిస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో ప్రాజెక్టులోకి చుక్క నీరు రాకపోవడంతో శుక్రవారం గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో 17 సంఘాల సభ్యులు, ఆయకట్టు రైతులు గోదావరి వద్దకు వెళ్లి నదికి రాళ్లను అడ్డంగా పెట్టి గంగనాల ప్రాజెక్టులోకి నీటిని మళ్లించేందుకు ప్రయత్నం చేశారు. అంతేకాకుండా గంగనాల మాటు కాలువకు నీటిని విడుదల చేసే గేట్లు తుప్పుపట్టి పైకి లేవని పరిస్థితి నెలకొంది. ప్రాజెక్టుకు నీళ్లు రాకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నా నీటిపారుదల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు గోదావరి నుంచి గంగనాల ప్రాజెక్టుకు నీళ్లు వచ్చేలా కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



గోదావరి నుంచి గంగనాల ప్రాజెక్టుకు నీళ్లు రావడం లేదు. అధికారులు పట్టించుకోవడం లేదు. నీళ్లు లేక యాసంగి పంటలు పండించే పరిస్థితి లేదు. గేట్లు తుప్పు పట్టి పైకి లేపినా లేవడం లేదు.

– ఆందుగుల నగేశ్, వీడీసీ చైర్మన్ వేములకుర్తి

ఆయకట్టుకు గంగనాలే దిక్కు



గంగనాల ద్వారా సుమారు 950 ఎకరాల్లో పంటలు పండించుకుంటాం. మాకు ఈ ప్రాజెక్టే ఆధారం. యాసంగి పంటలు పండించేందుకు ప్రాజెక్టులోకి నీరు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– రెడ్డవేణ తుక్కరాం, రైతు, వేములకుర్తి

అర్హులందరికీ గ్యారంటీ పథకాలు

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్

మేడిపల్లి: ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన వస్తుందని, అర్హులందరికీ ఆరు గ్యారంటీ పథకాల అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం భీమారం, మేడిపల్లి మండలాల్లోని మన్నెగూడెం, కొండాపూర్, కల్వకోట, కట్లకుంట గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడిన 20 రోజుల్లోనే 2 పథకాలను విజయవంతంగా అమలు చేసుకుంటున్నామని, మిగతా పథకాలను 100 రోజుల్లో అమలు చేస్తామని, పార్టీలకు అతీతంగా లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపడతామన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి

నాణ్యమైన విద్యుత్ అందించి అన్నదాతల్లో ఆనందం నింపేలా అధికారులు పని చేయాలని ప్రభుత్వ విప్ శ్రీనివాస్ అన్నారు. ప్రజాపాలనలో భాగంగా మన్నెగూడెంలో విద్యుత్ సబ్‌స్టేషన్ సందర్శించారు. ఈసందర్భంగా ఆదిని మెట్‌పల్లి డీఈ తిరుపతి, ఏడీఈ రఘుపతి, ఏఈ ఎక్కల్‌దేవి హరిప్రసాద్, నవీన్, విద్యుత్ సిబ్బంది సన్మానించారు.

సద్వినియోగం చేసుకోవాలి



దరఖాస్తు ఫారాలు అందజేస్తున్న విప్ అడ్లూరి

ధర్మపురి: ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని నక్కలపేట గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ధర్మపురి, గొల్లపెల్లి మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు దినేశ్, నిశాంత్ నాయకులు చిలుముల లక్ష్మణ్, ప్రత్యేకాధికారులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



ఎమ్మెల్యేను నోట్లతో సన్మానిస్తున్న నాయకులు

మల్యాల/కొండగట్టు: మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం 24 మంది లబ్ధిదారులకు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, అదనపు కలెక్టర్ దివాకర కల్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత సత్యం మొదటిసారిగా మండల కేంద్రానికి రాగా, స్థానిక కాంగ్రెస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. రాజారం గ్రామానికి చెందిన ఎడిపెల్లి రాజిరెడ్డి రూ.50 నోట్ల దండ వేసి అభిమానం చాటుకున్నారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కల్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ముత్యంపేట, నూకపల్లి, తక్కళ్లపల్లి గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, తహసీల్దార్ మునీందర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కొడిమ్యాల మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలనలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు.

పుడూర్‌ను మండలం చేయాలి

కొండగట్టు: కొడిమ్యాల మండలం పుడూర్‌ను మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని శుక్రవారం ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యంకు పూడుర్ సాధన జేఏసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కొత్త మండలాల ఏర్పాటుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బండ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేజ్‌వీల్ ట్రాక్టర్ పట్టివేత

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లో శుక్రవారం కేజ్‌వీల్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం కోరుట్ల ఆర్డీవోకు అప్పజెప్పామని పేర్కొన్నారు.

క్లుప్తంగా..

అయోధ్య అక్షింతల శోభాయాత్ర

మల్లాపూర్: అయోధ్య రాముని అక్షింతలు శుక్రవారం మండలంలోని వేంపల్లి గ్రామానికి చేరుకున్నాయి. స్థానిక హనుమాన్ ఆలయంలో అక్షింతలకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగించారు.

యాచకులకు దుప్పట్లు పంపిణీ

జగిత్యాల: జగిత్యాలకు చెందిన సహాయక బృందం సభ్యులు యాచకులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు కొండ సాయిచరణ్, బాలరాజు, జనార్దన్, సురేశ్, తాటిపాముల రవి, అరవింద్, హర్ష, జూకంటి శశి పాల్గొన్నారు.

ప్రశాంతంగా జరుపుకోవాలి

పెగడపల్లి: మండలంలో ఆదివారం రాత్రి నూతన సంవత్సర వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై సతీశ్ మండల ప్రజలకు సూచించారు. మద్యం తాగి పట్టుబడితే డ్రంకెన్ డ్రైవ్, ట్రిపుల్ రైడ్ చేస్తూ దొరికితే వాహనం స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కల్యాణలక్ష్మి పంపిణీలో కారు బొమ్మ ఏంటి?

సారంగాపూర్: కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో కారు బొమ్మ ఎందుకని, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ఇంకా తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వమే ఉందని భావిస్తున్నారని బీర్‌పూర్ ఎంపీపీ మసర్తి రమేశ్ అన్నారు. కల్యాణలక్ష్మి చెక్కుతో పాటు, కవరుపై ఎమ్మెల్సీ కవిత, కారు బొమ్మ ఉండడం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

ఏటీఎం ప్రారంభం

మేడిపల్లి: భీమారం మండల కేంద్రంలో శుక్రవారం ఇండిక్యాస్ ఏటీఎంను గుండేటి సత్యనారాయణ ఆధ్వర్యంలో జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు ప్రారంభించారు.

గోదావరినదిపై చెక్‌డ్యాం నిర్మించాలి

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తి శివారులో గోదావరినదిపై రత్నాల మడుగు వద్ద చెక్‌ డ్యాం నిర్మించాలని గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు పెంట లింబాద్రి శుక్రవారం హైదరాబాద్‌లోని జ్యోతిరావ్‌పూలే ప్రజాభవన్‌లో అధి కారులకు వినతిపత్రం అందజేశారు.

నిరుపేద కుటుంబానికి చేయూత

మల్యాల: మండలంలోని సర్వాపూర్ గ్రామానికి చెందిన మెరుగు శ్రీనివాస్ కుమారుడి వైద్య ఖర్చుల కోసం తెలంగాణ యువ చైతన్య ఫౌండేషన్ సభ్యులు రూ.10,016 ఆర్థికసాయం అందించారు.

ప్రజాపాలనలో నేతల మధ్య వాగ్వాదం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వెల్లుల గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో మెట్‌పల్లి జెడ్పీటీసీ భర్త కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ సాయిరెడ్డి మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులు ఇరువురిని సముదాయించడంతో గొడవ సద్దుమణిగింది.

ఇద్దరికి తీవ్రగాయాలు

ధర్మపురి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. గొల్లపల్లి మండలం శ్రీరాములపల్లెకు చెందిన నాగుల వెంకటేశ్, నాగుల దినేశ్ శుక్రవారం ఇంటి నుంచి బైకుపై ధర్మపురికి వస్తుండగా, హెచ్‌పీ పెట్రోల్‌బంకు వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులకు 108లో జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గెలుపోటములు సహజం



విద్యార్థుల నృత్యం



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: గెలుపోటములు సహజమని, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతి విద్యార్థి పాల్గొనాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో యువజన సర్వీసుల క్రీడా శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యువజనోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప వ్యక్తి వివేకానందస్వామి అని, నేటి యువతకు ఆయన ఆదర్శమన్నారు. యువత చేతుల్లోనే దేశ భవిష్యత్ ఉందని, విద్యార్థులు వారివారి రంగాల్లో రాణించాలని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జానపద నృత్యం, గీతాలు, వ్యాసరచన, ఫొటోగ్రఫీ, పెయింటింగ్ మేకర్ విభాగంలో ప్రతిభ కనబర్చినవారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. జానపద గీతాల్లో సోలోలో జి.రజిత, జానపద నృత్యం గ్రూపులో టీఎస్‌ఆర్‌జేసీ తాటిపల్లి, రేలారేరేలా గ్రూపులో అల్లీపూర్ స్కూల్, ఉపన్యాస పోటీల్లో ధర్మపురికి చెందిన దర్శిని, పోస్టర్ మేకింగ్‌లో రాయికల్‌కు చెందిన లక్ష్మణ్, వ్యాసరచనలో తాటిపల్లికి చెందిన కీర్తి ప్రశంసాపత్రాలు అందుకున్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి కోరుకంటి రవికుమార్, ఎలిగేటి రాజేంద్రప్రసాద్, ఎ.సతీశ్, అనిల్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ అరిగెల అశోక్, కౌన్సిలర్ తోట మల్లికార్జున్, పీఈటీలు పడాల విశ్వప్రసాద్, లక్ష్మీ రాంనాయక్, నాయకులు బోళేశ్వర్, నరేశ్, విక్రమ్ రెడ్డి పాల్గొన్నారు.

రాత్రి 11 దాటితే రోడ్లపై తిరగొద్దు

- మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ

కోరుట్ల/మెట్‌పల్లి: రాత్రి 11 గంటలు దాటిన తర్వాత అత్యవసర పరిస్థితుల్లో తప్ప కారణం లేకుండా రోడ్లపై తిరగవద్దని మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో గురువారం అర్ధరాత్రి జాతీయ రహదారిపై సీఐలు ప్రవీణ్‌కుమార్, లక్ష్మీనారాయణ, ఎస్‌ఐలు కిరణ్‌కుమార్, చిరంజీవితో కలిసి తనిఖీలు చేపట్టారు. రాత్రివేళ ద్విచక్ర వాహనాలపై రోడ్లమీద తిరుగుతున్న పలువురు యువకులను పట్టుకొని కొత్త బస్టాండ్ వద్ద కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, వర్తక, వాణిజ్య వ్యాపారులు తమ దుకాణాలను రాత్రి 10 గంటలకు, హోటళ్లు, రెస్టారెంట్లు రాత్రి 10.30 గంటలకే మూసివేయాలన్నారు. రాత్రి వేళ సెలబ్రేషన్ల పేరుతో ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. న్యూయర్ వేడుకల పేరుతో ఇష్టమొచ్చినట్టు రోడ్లపై తిరిగే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ప్రజాపాలన కార్యక్రమానికి పటిష్ట బందోబస్తు

- డీఎస్పీ వెంకటస్వామి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటస్వామి

జగిత్యాలక్రైం: ప్రజాపాలన కార్యక్రమానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని జగిత్యాల డీఎస్పీ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం జగిత్యాల రూరల్ మండలం అంతర్గాంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేలా పెట్టిన ప్రజాపాలనలో అర్హులంతా దరఖాస్తు చేసుకునేలా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్, ఎస్సై సదాకర్ పాల్గొన్నారు.

అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న నర్సింగారావు తదితరులు

మెట్‌పల్లి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పొందడానికి అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగారావు సూచించారు. పట్టణంలోని 5,6,7,8వ వార్డుల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పథకాలకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు లేదన్నారు. ప్రజాపాలన కార్యక్రమం వచ్చే నెల 6 వరకు ఉంటుందని, ఆ తర్వాత కూడా అధికారులకు దరఖాస్తులు అందజేయవచ్చన్నారు. కాగా రెండో రోజు 4,078 దరఖాస్తులు వచ్చినట్లు కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు.

పక్కాగా ఆరు గ్యారంటీల అమలు

మెట్‌పల్లిరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలను పక్కాగా అమలు చేస్తోందని జువ్వాడి నర్సింగారావు అన్నారు. శుక్రవారం మెట్‌పల్లి మండలం వెల్లుల, బండలింగాపూర్, ఏఎస్‌ఆర్ తండా గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాల్లో పాల్గొని అధికారులతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. తహసీల్దార్ శేఖర్, ఎంపీడీవో భీమేశ్‌రెడ్డి, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, మెట్‌పల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజు ప్రశాంతంగా ప్రజాపాలన



గోదూర్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న కోరుట్ల ఆర్డీవో రాజేశ్వర్



లక్ష్మీపూర్‌లో ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో నర్సింహామూర్తి

ఇబ్రహీంపట్నం/పెగడపల్లి/సారంగాపూర్/కోరుట్ల రూరల్/కోరుట్ల/కథలాపూర్/మల్లాపూర్/జగిత్యాలరూరల్: ఆరు గ్యారంటీ పథకాల అమలులో భాగంగా ప్రజాపాలన పేరిట జిల్లాలో నిర్వహిస్తున్న గ్రామ సభలు రెండో రోజు ప్రశాంతంగా కొనసాగాయి. ఇబ్రహీంపట్నం మండలం గోదూర్, ఫకీర్ కొండాపూర్, మూలరాంపూర్ గ్రామాల్లో ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించారు. గోదూర్‌లో గ్రామ సభను కోరుట్ల ఆర్డీవో రాజేశ్వర్ సందర్శించారు. గోదూర్‌లో 613, ఫకీర్ కొండాపూర్ 228, మూలరాంపూర్ 226 దరఖాస్తులు వచ్చినట్లు ప్రత్యేక అధికారులు కృపాకర్, ప్రభు, ప్రసాద్ తెలిపారు.పెగడపల్లి మండలం మద్దులపల్లి, నంచర్ల, మ్యాకవెంకయ్యపల్లి గ్రామాల్లో నిర్వహించిన సభల్లో 1,450 దరఖాస్తులు వచ్చినట్లు ప్రత్యేక అధికారి వేణుగోపాల్‌రావు తెలిపారు. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో చిన్నకొల్వాయి 41, కోమన్‌పల్లి 103, కోనాపూర్ 475, పెంబట్ల 663, లక్ష్మీదేవిపల్లిలో 613 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో రాజేందర్ తెలిపారు. కోరుట్ల పట్టణంలో 5,481 మంది దరఖాస్తు చేసుకున్నారు. పట్టణంలోని 5,6,7,8వ వార్డుల్లో దరఖాస్తులు స్వీకరించగా ఆర్డీవో రాజేశ్వర్ పరిశీలించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, కమిషనర్ రాజేశ్వర్, ప్రత్యేక అధికారి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కోరుట్ల మండలం కల్లూర్ గ్రామంలో 249, తిమ్మయపల్లె గ్రామంలో 192 దరఖాస్తులు వచ్చాయి. తహసీల్దార్ కిషన్, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో నీరజ, సర్పంచులు పాల్గొన్నారు. కథలాపూర్ మండలం గంభీర్‌పూర్‌లో 1,192, తక్కళ్లపెల్లిలో 796, బొమ్మెనలో 721 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో జనార్దన్ తెలిపారు. మల్లాపూర్ మండలం ముత్యంపేట, సాతారం, హుస్సేన్‌నగర్ గ్రామాల్లో గ్రామసభలను కోరుట్ల ఆర్డీవో రాజేశ్వర్, మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి పర్యవేక్షించారు. డీఆర్డీవో నరేశ్, తహసీల్దార్ వీర్‌సింగ్, ఎంపీడీవో రాజశ్రీనివాస్, ఎంపీవో జగదీశ్ పాల్గొన్నారు. ముత్యంపేట సభలో ప్రజలకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు దరఖాస్తు ఫారాలు అందజేశారు. జగిత్యాలరూరల్ మండలం లక్ష్మీపూర్‌లో ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆర్డీవో నర్సింహామూర్తి పరిశీలించారు. ఎంపీడీవో రాజేశ్వరి, డెప్యూటీ తహసీల్దార్ వినయ్ పాల్గొన్నారు. లక్ష్మీపూర్, చల్‌గల్, తాటిపల్లి, అంతర్గాం గ్రామాల్లో 2,815 దరఖాస్తులు స్వీకరించినట్లు ప్రత్యేకాధికారి అబ్దుల్‌హుస్సేన్ పేర్కొన్నారు. తహసీల్దార్ రామ్మోహన్, ఎంపీడీవో రాజేశ్వరి, ఎంపీవో రవిబాబు, ఎంఈవో గాయత్రి పాల్గొన్నారు. జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట గ్రామంలో 622 దరఖాస్తులు స్వీకరించినట్లు ప్రత్యేకాధికారి రాజ్‌కుమార్ తెలిపారు. ఎంపీపీ ములాసపు లక్ష్మి, ఎంపీడీవో శైలజరాణి, సర్పంచ్ రొతు జయ పాల్గొన్నారు.

తాటిపల్లి గురుకుల విద్యార్థుల ప్రతిభ



గ్రూప్‌డాన్స్‌లో మొదటి బహుమతి సాధించిన విద్యార్థులు

మల్యాల: మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల కళాశాల విద్యార్థులు జిల్లాస్థాయి యువజనోత్సవాల్లో ప్రతిభచాటారు. వ్యాసరచన, పాటల పోటీల్లో ఎస్.కీర్తి, రుచిత జిల్లాస్థాయిలో మొదటి బహుమతులు, గ్రూప్ డాన్స్‌లో విద్యార్థులు మొదటి బహుమతి సాధించారని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు.